
"టైమెంతైందర్రా!"

ఆ గదిలోంచి ప్రతీ అరగంటకూ మూసివున్న తలుపులను చొచ్చుకొని బయటకు వచ్చే కంఠం అడిగే ప్రశ్న అది.

ఎంతయిందో బయటనుంచి యెవరో చెబుతారు.

"అబ్బ" అనో "ఇంతేనా" అనో నిట్టూరుస్తుందా కంఠం.

"చంపేస్తున్నారు బాబు, ఈ టైం పిచ్చితో" అని గొణుక్కుంటారు ఇంట్లో వాళ్ళు.




"ఎంతయిందో! చాల్లే అయిపోయింది. ఇంక టైం అడగను!"

ఆ ముసలాయన నిరీక్షణకు అర్థం ఏవిటి?

ఆ గదిలో పడుకొని ఉన్న జీవికి మాత్రం టైముతో ఏదో బలీయమయిన అవసరం, అనుబంధం ఉన్నట్లు కనబడుతుంది.

ఉదయం నలుగురూ లేచినది మొదలు రాత్రి బాగా ప్రొద్దుపోయేవరకూ అరగంట అరగంటకూ "టైమెంతా?" అని అడుగుతూనే ఉంటాడాయన. ప్రక్కనే హాలులో గోడకు తగిలించిఉన్న పాత గోడ గడియారం గంటలూ అరగంటలూ



మంగళంపల్లి శుభప్రద

కొడుతూనే వుంటుంది. అయినా ఆయన అడుగుతాడు. వాళ్ళు విసుక్కుంటారు. ఇది ఆ యింటి నిత్య కార్యక్రమాలలో ఒక భాగం!

"ఈయన 'టైం'పిచ్చి కాదు కాని. చెప్పలేక అహర్నిశలూ అంకిళ్ళు పడి చస్తున్నాను. మీకేం! ప్రొద్దున 7 గంటలకు స్కూలుకెళ్ళి పదకొండు గంటల కొస్తారు. మధ్యాహ్నం ఓ గంట యింటి దగ్గరుంటారో, వుండరో మళ్ళీ రాత్రి ప్రయివేట్లూ అవీ చూసుకొని తొమ్మిది గంటలకుకాని యింటి ముఖం చూడరు. పిల్లలు స్కూలుకు పోతారు. ఇదంతా నా మొహాన పడింది. వేళకు మందులు, ఆహారాలు పొయ్యడానికే చస్తోంటే ఈ 'టైం' కూడా చెబుతూ ఎక్కడ కూచోను. మల మూత్రాలెత్తడానికి పెట్టినట్లే టైం చెప్పడానికికూడా ఓ మనిషిని పెట్టండి. లేదంటే మరో గోడ గడియారం కొని ఆ గదిలో కూడా తగిలించండి. కావలసినప్పుడల్లా ఆయనే చూసుకుంటారు" అని ఆ ఇంటావిడ భర్తతో సణుగుతుంది.

దానికాయన "బాగానే వుంది. మొదటి దానికి మొగడు లేడుకాని, కడదానికి కల్యాణమన్నాట్ట! రిటైరయ్యే వయసొస్తోంది. ఇంతవరకూ చేతికో గడియారం లేదు. రెండేళ్ళక్రితం అత్తవారింటికెడుతూ అమ్మాయి ముచ్చటపడిన రిష్ట్‌వాచీ యింతవరకూ కొనలేకపోయాను! ఏడాదినుంచీ అబ్బాయి పోరుగూళ్ళే ఇబ్బందిపడుతున్నా. వాడికో అలారం గడియారం ఇవ్వలేకపోయాను- రేపో, మాపో అని చూస్తున్న ఈ ముసలాయన కోసం గడియారం కొనమంటావా? ఓపికుంటే అడిగినప్పుడు చెప్పండి- లేకపోతే నోరు

స్వీట్ ఆర్ట్స్ వారి
సంక్రాంతి కార్డుల సెట్టు
బాపు రమణీయ రూపకల్పన
లక్ష్మి సెట్—6 రకాలు (బాపుచిత్రాలు) రు. 10-00
బాపు సెట్—15 రకాలు (బాపుచిత్రాలు) రు. 20-00
ఎస్సార్టెడ్ సెట్—15 రకాలు రు. 16-00
డీలర్లకుకూడా సెట్‌ల సౌకర్యం
బాపు సెట్—90 కార్డులు (15 రకాలు) రు. 90-00
ఎస్సార్టెడ్ సెట్—90 కార్డులు (15 రకాలు) రు. 75-00
పై రెండు సెట్లు కలిపి 180 కార్డులు రు. 150-00
మనియార్డర్‌గాని, పోస్టల్ ఆర్డర్‌లుగాని మాత్రమే పంపాలి- ఇతరమేమీ అంగీకరించబడవు. వి. పి. పి. లేనేలేదు.
**Cards Crafts Classics**
12-E Byramjung Bhahadur Lane
Post Box No. 2421 Madras-600002
SA-SC/82/9

పళ్ల డాక్టరు చెబుతున్నారు
పళ్లు, చిగుళ్ల సక్రమ సంరక్షణకోసం
పళ్లను బ్రష్ చేసుకోవడం ఎంత ముఖ్యమో,
చిగుళ్లను మాలిష్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం
ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్
టూత్‌బ్రష్ వాడండి
మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్ కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది



మృదువైన బిళ్లని కుచ్చులు మీ చిగుళ్లను మాలిష్ చేస్తాయి
దృఢమైన పీలిరంగు కుచ్చులు మీ పళ్లను శుభ్రపరుస్తాయి
ఫోర్‌హేన్స్
టూత్ బ్రష్
ఇంటిల్లిపాదికోసం
Regd. T.M: Geoffrey Manners & Co. Ltd.
156 F-122 TEL

మూసుకొని పడుండండి" అని మంది పడతాడు.

ఈ వాదనలన్నీ గదిలోవున్న ముసలాయన వింటూనే వుంటాడు. కొడుకు అన్నీ తనకు వినబడాలనే అలా గొంతు చించుకు మరీ అరుస్తాడని ఆయన కనిపించేది. "కొడుకు, కోడలు, మనవలు విసుక్కొని తనను తిట్టుకుంటున్నప్పుడు ఆ తిట్లు తనకు వినబడకుండా వుంటే ఎంత బాగుండును" అని ఆశపడినా— మళ్ళీ అంతలోనే— వాళ్ళను టైం టైం అని తాను మాటిమాటికి వేధించడం మాత్రం ఏం బాగుంది? ఇంకా కోడలు మంచి మనిషి కనుకనే తన పిచ్చి ప్రశ్నకు ఒకసారి విసుక్కొన్నా మరోసారయినా సమాధానం చెబుతోంది, అని సరిపెట్టుకునేవాడు.

కొడుకు కోడళ్ళ విసుగుదల బాగా బాధ కలిగించినప్పుడు కనీసం ఓ రెండు గంటలయినా 'టైం' అడగకూడదని నిర్ణయించుకొని, కళ్ళు మూసుకు పడుకుంటాడు. కాని అంతలోనే లోలోపల ఏదో తపన. కాలాన్ని తెలుసుకోవాలనే ఏదో వుబలాటం ఆయన అనుభవిస్తాడు. శరీరంలోని ప్రతీ అంగం ఆయన అధీనం తప్పినట్లే ఆ సమయంలో మనసు కూడా అదుపు తప్పుతుంది. మళ్ళీ అరగంట తిరక్కుండానే ఆయన కంఠంలోని శక్తినంతనూ కూడదీసుకొని అరుస్తుంది "టైమెంతయిందిరా?" అని.

కోడలు విసుగ్గా వుంటే "ఆఁ! ఎంతో కొంతయింది. కాసేపు కళ్ళు మూసుకొని పడుకొందురూ" అని కసురుకుంటుంది. కాస్త ఉత్సాహంగా వుంటే "ఫలానా అంత" అని చెబుతుంది.

ఆయన మంచాన పడిన మొదటి రోజులలో ఎన్నో రకాల ఆలోచనలు, భావాలు ప్రతీరోజూ ఆయన్ను పరామర్శిస్తూ వుండేవి. గతాన్ని గురించిన జ్ఞాపకాలు, వర్తమానంతో సంబంధాలు, భవితవ్యాన్ని గూర్చిన ఊహలు— ఇలా ఎన్నెన్నో ఉండేవి. కాని అవన్నీ ఇప్పుడాయన్ను ఒక్కసారిగా విడిచిపెట్టి వెళ్ళిపోయాయి. అవన్నీ తనను ఎందుకు విడిచి వెళ్ళిపోయాయో ఆయన కర్థంకాదు. ప్రస్తుతం ఆయన్ను పట్టుకు పీడించేదల్లా కాలాన్ని తెలుసుకోవాలనే తపన- తొందర— ఆరాటం!

అలా ఎందుకుంటుందో? ఇది ఇంట్లో వాళ్ళకేకాదు, ఆయనకుకూడా ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది. కేవలం శరీరంలోని బాధలనుంచి విముక్తిపొందే సమయం కోసమా ఈ ఆరాటం?— ఏమో!

ఆయన శరీరంలో ఏం బాధలున్నాయో అంతగా తెలియదుకాని. తరచుగా ఓ దగ్గుతెర మాత్రం ఆయనతో తాను పెట్టుకున్న చిరకాల సంబంధానికి చిహ్నంగా అయిదారు నిమిషాలు ఆయన్ను పెనవేసుకుపోతుంది. దాని ధాటికి ఆయన వుక్కిరిబిక్కిరయి లుంగజుట్టుకొనిపోతాడు. దగ్గు వచ్చినప్పు డాయనకు టైం అడగ బుద్ధవుతుంది. ఆయనలోని వాణి నిద్రలేచి "టైం'ఎంతయిందిరా" అని అరుస్తుంది.

సమాధానం విన్నాక "పన్నెండేనా అయింది" అని నిస్పృహతో మూల్గుతాడు. "పరవాలేదు. ఇలాగే నిమిషాలు, రోజులు గడిచిపోతాయి," అని లోలోపల సరిపెట్టుకున్నట్లుగా తృప్తిపడేవాడు.


ఆ నిస్పృహ చూసినవాళ్ళకూ, ఆ మాటలు- మూల్గు- విన్నవాళ్ళకు ఆయన టైంకోసం పడే ఆరాటానికి, శరీరంలోని బాధలకు సంబంధం తప్పక ఉందని అనిపించేది.

ఒకసారి కోడలు ఇరుగు పొరుగు అమ్మలక్కలతో కబుర్లు చెబుతూ "ఆయనకూ జీవించాలనే కాంక్ష క్రమంగా తగ్గిపోతోందనుకుంటానమ్మా. మొన్నటి వరకూ 'అబ్బాయీ ఈ మందు పట్రా— ఆ మందు పట్రా' అనేవారు. ఈమధ్య మందు మాటంటేనే కస్సుమంటున్నారు. ఇల్లా చావుకోసం ఎదురుచూసే ఆయనకి ఈ టైం పిచ్చేమిటమ్మా- చస్తున్నాం" అని అంటూంటే విని ఆయన నవ్వుకున్నాడు.

"అవును- నిజమే మరి! అందరకూ కాలం అంటే జీవితమని అర్థం. జీవితంతో పనిలేని వాళ్ళకు కాలంతో పనేఁవిటి? నిజమే!" అని అనుకుంటూండగా ఆయనకు గతం గుర్తుకొచ్చింది.

తాను వయస్సులో వున్నప్పుడు తనకు టైం అంటే ఎంతో భయంగా వుండేది. ఎవరయినా కాలం త్వరితగతిని గురించి మాట్లాడితే గుండెలమీద కొరడాతో కొట్టినట్లయ్యేది. చెయ్యవలసిన పనులెన్నో కళ్ళముందు భారంగా కనబడేవి. భయంగా కళ్ళు మూసుకునేవాడు. బాధ్యతలూ, కాలం- ఒకదానితో ఒకటి పోటీపడి తన్ను తరుముతున్నట్లనిపించేది. ఏదయినా ఆధారం దొరికితే పట్టుకు నిలబడిపోవాలనిపించేది. టైం ఎంత!— టైమెంత? టైం- టైం ఈ ఆరాటం అప్పటినుంచీ తన నరనరాల్లో జీర్ణించిపోయింది. క్రమంగా ఈ ఆరాటం 'కాలం' యెడలభయంగా మారిపోయింది. కాలం తనకొక బద్ధ విరోధి— అది తనను నీడలా వెన్నాడుతున్నట్లనిపించేది. అందుచేతే అత్తవారు తనకు ఎప్పుడో ముచ్చటగా కొనిచ్చిన జేబు గడియారం అమ్మేసి, ఇంట్లో గోడకు పడుండే గోడగడియారం కొన్నాడు. ఇప్పుడు హాలులో గంటలు కొట్టే గోడ గడియారం తాను రోజులలో కొన్నదే. పెద్ద వయస్సులో సంసారంబాగా ఆర్థికంగా చితికిపోయినప్పుడు అమ్మేసిన సామానులలో నిజానికి తాను గోడ గడియారాన్ని కూడా చేరుద్దామనుకున్నాడు. కాని అప్పటికే ప్రాజ్ఞుడయిన కొడుకు ఆ ప్రయత్నం కొనసాగనివ్వలేదు.... అవును పాపం! అతని జీవితం కూడా కాలంతోనే ముడిపడి వుందికదా మరి! యిలా గతాన్ని నెమరువేసుకుంటూ తనకిప్పుడు 'టైం' తెలుసుకోడానికి ఎంతో సహాయంగా వుంటూన్న పాత గోడ గడియారంతూ — తనకూ వున్న బంధాన్ని తలచుకొని ఆయన నవ్వుకున్నాడు.

తమ సంసారం ఆర్థిక స్థితిని గురించి కోడలు తన భర్తతో విసిరే విసుర్లలో ఈ గోడ గడియారం సంగతికూడా వస్తూనే వుండేది.



"ఎంత మంచాన పడితే మాత్రం ఏం తప్పుతున్నాయి కనకా! ఆ మనిషి కా మనిషే బరువు! మీ అమ్మగారు పోయి నాలుగైదేళ్ళయింది. పెట్టుపోతల్లో వయితేనేం. చాకిరీ విషయంలో అయితేనేం ఆయనకేం లోటు జరిగింది. ఈ రోగమొచ్చాకకూడా ఈ మధ్యనంటే మందులు లేవుకాని, పాలు, గ్లూకోజ్‌లు ఏమి మానేయి? ఇవన్నీ భరించడానికి ఆయన మనకిచ్చిన ఆస్తిపాస్తులు మాత్రమేమున్నాయి. ఇల్లమ్మారు, పొలమమ్మారు, మీ అమ్మగారి నగలన్నీ అమ్మారు. అప్పుడు అడ్డుపడ్డారు కనకనె అస్తమానం ఆయనడిగే టైం చెప్పడానికి ఈ పాత గోడ గడియారమన్నా మిగిలింది. లేకపోతే అదీ పోను!" అని ఆమె అనే మాటలు వినబడ్డప్పుడు "చ! చ! అన్ని అవయవాలూ పడిపోయిన ఈ స్థితిలో కూడా చెవులు యింత బాగా పని చేయడం ఎంత దురదృష్టం" అని ఆయన బాధపడేవాడు. చెవులు అంత




# పాపాయికి అతి ఉత్తమమైనవి తల్లిపాలు

**పాపాయికి చనుబాలు ఎందుకు ఉత్తమమైనవి**

తల్లి పాలు పరిశుభ్రమైనవి, సూక్ష్మజీవులు లేనివి, పసి బిడ్డ జీర్ణశక్తికి నూటికి నూరు పాళ్లూ అనువైనవి వివిధ రోగాల పట్ల తల్లికి వుండే రోగ నిరోధక శక్తి చనుబాలద్వారా బిడ్డకు లభించటమే కాక, పాపాయి తల్లి ప్రేమనూ, రక్షణనూ కూడా అనుభూతి చెందుతాడు. అతడికి కడుపుకు సంబంధించిన బాధలూ, చర్మం పొక్కులు లేవడమూ కూడా సాధారణంగా రావు.

**3 నెలలు నిండాక, పాలు మాత్రమే ఇస్తే సరిపోదు**

మీ పాపాయియొక్క పెరుగుతున్న పోషణ అవసరాలు తీర్చేందుకు అతడి ఆహారాన్ని మార్చాలి. పోషణ ఇచ్చేవి, తేలకైనవీ, పుష్కలంగా ఐరన్ కలిగి ఉన్నవీ అయిన ఘన ఆహారాలను డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

**డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?**

ఘన ఆహారాలు ప్రారంభించడాం కోసం, ప్రత్యేకంగా తయారుచేయబడిన ఆహారం ఫారెక్స్. దీనిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, కాల్షియం, ఫాస్పరస్, విటమిన్లు ఉన్నాయి. ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది. అందుకే, పాపాయి సంపూర్ణమైన పెరుగుదల కోసం ఆదర్శవంతమైన ఘన ఆహారం ఫారెక్స్.




ఉచితం! "పాపాయి మొదటి ఏడాది పుస్తకం." కొత్తగా తల్లులైన వారు పిల్లల పట్ల తీసుకోవలసిన శ్రద్ధ గురించి సులభ రీతిలో వివరిస్తుంది. మీ ప్రతికోసం ఈ క్రింది చిరునామాకు వ్రాయండి:

పి. ఓ. బాక్స్ నం. 19119,
(FAR 16 B), బొంబాయి 400 020.

డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్
సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం.

CASGLF-11-202 TEL

వెలువడింది!
జొన్నలగడ్డ లలితాదేవి
మొదటి నవల
"విష్ణుమాయ"
వెల: రు. 16/-
మీరెంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ నవల ద్వితీయ ముద్రణ వెలువడింది. నేడే మీ కాపీని రిజర్వు చేసుకొనండి.
వాహినీ పబ్లిషింగ్ హవుస్,
ఏలూరురోడ్డు, విజయవాడ-520002.
ఫోన్ నెం. 73686.
VTS/V/82

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్రజ్యోతి"
దినపత్రికనే చదవండి

ఫ్రెంచి, రష్యన్
విదేశ భాషలు తెలుగు ద్వారా నేర్ప బడును. ఉచ్ఛారణ, అర్థం తెలుగులోనే వుండును. ఇది మూడు నెలల కోర్సు. ఉచిత వివరాలకు స్వంత అడ్రసు వ్రాసిన పోస్టల్ కవరు పంపండి.
A. S. Raju.
56, Jubilee Road,
Madras—600033.

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కలిగించే శ్రేష్ఠ మైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

చక్కగా పనిచేస్తున్నాయి కనకనే నెల రోజుల క్రితం—వాళ్ళు ఎంత మెల్లగా మాట్లాడుకున్నా తన కొడుకుతో డాక్టరుగా రన్నమాటలన్నీ ఆయన వినగలిగేడు.

"ప్రస్తుతానికి ఆయన మమ్మల్నేం బాధించడంలేదుకాని డాక్టరుగారు, ఈ టైం పిచ్చితో మాత్రం వేపుకు తినేస్తున్నా డండీ! ప్రతీ అరగంటకూ టైమెంత— టైమెంత అంటూంటాడు. అప్పుడు చూడండీ కాలూ చెయ్యి పడిపోయి మంచం ఎక్కినరోజుల్లో- మిరన్నారు— శరీరం బాగా దెబ్బ తినేసింది- మహ ఉంటే ఓ ఏడాది. అంతకన్న దాటదని. అప్పటినుంచీనండి ఈ టైం గోల మరీ యెక్కువయిపోయింది కాలూ, చెయ్యీ ఆడుతున్నప్పుడు యెల్లావుండేవాడో మాకు తెలిసేది కాదుకాని ఈ మధ్య ఈ ఆరాటం మరీ యెక్కువయిపోయింది" అని తన కొడుకు అంటూంటే డాక్టరుగారు "ఒక్కొక్క రోగికి శరీరం క్షీణిస్తోన్న కొద్దీ, మనస్సులో పాతుకుపోయిన బల హీనతలన్నీ ప్రకోపిస్తూ వుంటాయి. దానికి మనం కంగారుపడవలసిన దేమీ లేదులెండి. అయినా మీ నాన్నగారికి మొదటినుంచి టైంపిచ్చి యెక్కువేకదా" అని నవ్వేసి వెళ్ళిపోయారు.

ఆ మాటలు విన్నప్పుడు "నిజమే! కాలాన్ని గురించిన దౌర్బల్యం తనకు మొదటినుంచీ ఎక్కువే! డాక్టరు తనను బాగానే అర్థం చేసుకొన్నాడు. కా. ఆనాటి జేబుగడియారమే వుంటే టైం కోసం తానిల్లా అందరనూ విసిగించవలసిన అవసరం లేకపోనుకదా!" అని అనుకుంటూ అయినా చేరవలసిన గమ్యం, సాధించవలసిన లక్ష్యం ఉన్నప్పుడే జీవితంలో కాలానికి విలువ. అవేవీలేని తనకెందుకీ తపన? అని నిట్టూరుస్తూ కళ్ళు మూసుకున్నాడు.

గతంలోని ఓ చిన్న సంఘటన మనస్సులో మెదిలిందాయనకు. తానానాడు ఓ తొందర పనిమీద పొరుగూరు ప్రయాణం పెట్టుకొని బస్‌స్టాండ్‌లో నిల బడ్డాడు. తానెక్కవలసిన బస్సింకా ఓ ఇరవై నిమిషాలకు కాని రాదన్నారు. పని చాలా తొందర! నిమిష మొకయుగంలా గడుస్తోంది. ఎప్పుడు ఇరవై నిమిషాలు జరగడం- ఎప్పుడు బస్సు రావడం, తన పక్కనే నిలబడి, తనలాగే బస్సుకోసం ఎదురు చూస్తున్న ఓ రిస్టువాచీ యువకుణ్ణి ప్రతి రెండు నిమిషాలకూ టైమెంత అని అడగడం ప్రారంభించాడు తాను. చాలా తీవ్రంగా ఏదో పుస్తకం చదవడంలో మునిగిపోయిన ఆ అబ్బాయి, చిరాకుగా ఓ రెండు మూడు మారులు టైం చెప్పినా, తర్వాత తనమాటే వినిపించుకోకుండా చదువులో నిమగ్నమైపోతూ వచ్చాడు. నిజానికి అతడుకూడా ప్రతి రెండు నిమిషాలకు 'టైం' చూసుకుంటూనే ఉండేవాడు. కాని తనమాట మాత్రం వినిపించుకునేవాడు కాదు.... ఇంతలోనే బస్సు వచ్చింది. వెంటనే తనచేతిలోని పుస్తకాన్ని అక్కడే ఉండిపోయిన మరొకరి చేతికిచ్చేసి, తనకన్న ముందే ఆ యువకుడు బస్సెక్కేశాడు. అప్పుడు తనకర్థమయింది- తనలాగే ఆ అబ్బాయికూడా 'టైం' కోసం విపరీతమయిన ఆరాటంతో ఉన్నాడని. కాని అతని ఆరాటానికి, తన ఆరాటానికి ఎంత తేడా ఉంది! అతనికి పుస్తకం అవకుండా బస్సు వచ్చేస్తుందేమోనని బెంగ! తనకు బస్సు రావడంలేదని బెంగ!.... ఎంత తేడా!

ఈ సంఘటన తలచుకొంటూంటే ఆయనకు, అప్పటి తన 'టైం' పిచ్చికి, ఇప్పటి తన 'టైం' పిచ్చికి ఆ తేడా వున్నట్లు కనబడింది. అప్పుడు కాలం తనను తరుముకు వచ్చేది. ఇప్పుడు కాలాన్ని తను తరుముకుపోతున్నాడు. ఆనాడు కాలం పరుగెట్టుకుపోతోందే అని భయం, ఈనాడు కాలం పరుగెట్టదేమా— అని బెంగ. ఆనాడు కాలం తనకు విరోధి. ఈనాడు కాలం తనకు పరమ మిత్రుడు. తన కాలనిరీక్షణలోని ఈ తేడాను గ్రహించే వాళ్ళెవరు? అని అనుకుంటూ ఓసారి దీర్ఘంగా నిట్టూర్చేసరికి ఆయన్ను దగ్గుతెర కప్పేసింది.

ఆ రోజు ఉదయం నుంచీ ముసలాయన గదిముందు హడావిడిగా వుంది. కొడుకు స్కూలుకు సెలవు పెట్టాడు. కోడలు అన్నం ఒక్కటే పడేయడంతో వంట సరిపెట్టింది. పిల్లలు కూడా బడి మానేసి బిక్క ముఖాలతో తిరుగుతున్నారు. డాక్టరు వచ్చి పెదవి విరిచి వెళ్ళాడు.

మధ్యాహ్నం పాత గోడ గడియారం సరిగ్గా పన్నెండు సారులు గంటలు కొట్టింది. ముసలాయన మెల్లిగా కళ్ళు తెరిచి ఒక్కసారి తనచుట్టూ చేరి వున్న నలుగురి ముఖాలు కలయజూశాడు. చివరగా కొడుకువైపు చూపు నిలిపి "ఎంతయిందీ! చాల్లే. అయిపోయింది, ఇంక 'టైం' అడగను!" అని చిన్న నవ్వు ముఖం మీదకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

తర్వాత ఆయన కాల నిరీక్షణకూ— ఆ ఆఖరి చూపుకూ ఎవరికితోచిన అర్థాలు వాళ్ళు చెప్పుకున్నారు. ●